క్లుప్తంగా

కొండకమర్లలో కార్డెన్ సెర్చ్



తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది

ఓడీచెరువు: కొండకమర్లలో మంగళవారం సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అక్రమ మద్యం కేసులో పాత ముద్దాయిల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దుకాణాల ముందు వాహనాలు నిలపరాదని అతిక్రమించిన వారిపై అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు



ప్లాస్టిక్ కవర్లు వినియోగించరాదంటూ హెచ్చరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పుట్టపర్తి టౌన్: హోటల్, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శానిటేషన్ అధికారి శివయ్య హెచ్చరించారు. మంగళవారం పుట్టపర్తి పట్టణంలో పలు హోటళ్లు, దుకాణాలు, వారపు సంతను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ వాడుతున్న ప్లాస్టిక్ కవర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శానిటేషన్ అధికారి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుందన్నారు. ఇటువంటి కవర్లను పశువులు తిన్నా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు రుణాలను వడ్డీతో రెన్యూవల్ చేయాలి



చెన్నేకొత్తపల్లిలో కెనరాబ్యాంకు ముందు నిరసన తెలుపుతున్న రైతులు

చెన్నేకొత్తపల్లి: రైతులు కరువుతో అల్లాడుతున్నారని, బంగారు రుణాలను వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని స్థానిక కెనరా బ్యాంకు ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రైతు సంఘం నేత లింగన్న మాట్లాడుతూ కరువు నేపథ్యంలో రైతులు మొత్తం రుణం చెల్లించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. బ్యాంకర్లు స్పందించి వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని కోరారు. అనంతరం మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన మేనేజర్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో కోళ్లఫారం కోసం నిర్మించిన ఓ షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన 33 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ధర్మవరానికి చెందిన శ్రీనివాసులు ముదిగుబ్బ మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని ఈ షెడ్‌లో నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో సీఎస్‌డీటీ మునిస్వామి, పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి, స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు.


గ్రామాల్లో పోలీస్ నిఘా తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

తలుపుల : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి గ్రామంలోనూ పోలీస్ నిఘా తప్పనిసరి అని డీఎస్పీ శివనారాయణస్వామి పోలీసులకు సూచించారు. తలుపుల పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. మండలంలో క్రైం రేటు, పాత కేసుల వివరాలు, ఇటీవల ఏటిగంగమ్మ ఆలయం సమీపంలో జరిగిన హత్య, దొంగతనం తదితర కేసుల పురోగతిపై ఎస్‌ఐ నరసింహుడుతో ఆరాతీశారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నాగేంద్ర, ఏఎస్‌ఐలు మస్తాన్, గుర్రప్ప పాల్గొన్నారు.

హాయ్‌రే హాయ్.. ఈత కొడదామోయ్



పోతుకుంట వద్ద ఉన్న బావిలో ఈత కొడుతున్న యువకులు



కుణుతూరు సమీపంలో గట్టుపై నుంచి బావిలోకి దూకుతున్న యువకులు

- ఎండల నుంచి ఉపశమనం కోసం..
- చెరువులు, బావులు, నీటికుంటల బాట
- పిల్లలు ఈత కొట్టే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

ధర్మవరం రూరల్: టెన్త్, ఇంటర్ పరీక్షలు ముగిశాయి. విద్యార్థులు కాస్త రిలీఫ్ అయ్యారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల పరీక్షలు వారం రోజుల్లో ముగియనున్నాయి. వేసవి సెలవులు మొదలవుతాయి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఖాళీ సమయాన్ని సరదాగా గడిపేస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి చెరువులు, బావులు, నీటి కుంటలను ఆశ్రయిస్తున్నారు. స్నేహితులతో కలిసి ఈత కొడుతూ చిల్ అవుతున్నారు. ఈత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశమూ లేకపోలేదు. ఈత కొడుతూ ఎంజాయ్ చేస్తున్న వారిని చూస్తూ ఈత రాని వారు సరదాగా నీటిలోకి దిగుతున్నారు. అయితే లోతు తక్కువగా ఉన్నంత వరకు ఇబ్బంది లేదు. ఊహించని విధంగా లోతు ఉన్న ప్రదేశంలోకి వెళితే ఈతరాని వారు నీట మునిగి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈత రాని వారు నీటమునిగినపుడు భయంతో ఆసరా కోసం ఈత కొడుతున్న వారిని గట్టిగా బిగపడితే మాత్రం ఇద్దరూ ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉంది. గత ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో ధర్మవరం చెరువుతో పాటు నియోజకవర్గంలోని చాలా చెరువులు, కుంటలు, బావుల్లోకి నీరు సమృద్ధిగా చేరింది. రోజూ ఉదయం పది గంటలు దాటగానే పిల్లలు, పెద్దలు ఈత కోసం నీటి ప్రదేశాలకు వెళ్తున్నారు. సాయంత్రం వరకు అలా జలకాలాడుతూ సేదదీరుతున్నారు.

అవగాహన కల్పించండి

విద్యార్థులు తమ తల్లిదండ్రుల మాట కంటే ఉపాధ్యాయుల మాట ఎక్కువగా చెవికెక్కించుకుంటారు. మరికొద్ది రోజుల్లో వేసవి సెలవులు వస్తున్నాయి. సెలవుల్లో బావులు, చెరువులు, కుంటల్లో ఈతకు వెళ్లేటపుడు తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లేలా పిల్లలకు అవగాహన కల్పించాలి. ప్రమాదాల గురించి విద్యార్థులకు తెలియజేసి.. జాగ్రత్తలు తెలియజేయాలి.

నిర్లక్ష్యం వద్దు

పిల్లలు సరదాగా ఈతకు వెళ్తామంటే తల్లిదండ్రులు సరి అని వదిలేయకుండా వెంట వెళ్లాలి. ఈత వచ్చే వారిని కనిపెట్టుకొని ఉండి.. ఈత ముగిసిన తరువాత వారిని ఇళ్లకు తీసుకెళ్లాలి. ఈత రాని పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి. పిల్లలకు దగ్గరుండి ఈత నేర్పించాలి. తెలిసిన వారితో పంపకుండా తమ పిల్లల పట్ల వారే ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది.

పిల్లల పట్ల అజాగ్రత్త వద్దు



ఇంట్లో తెలియకుండా చాలామంది పిల్లలు సరదాగా స్నేహితులతో కలిసి బావులు, చెరువుల్లో ఈతకు వెళ్తుంటారు. అక్కడ ఈత రాక సరదాగా నీళ్లలోకి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంది. వేసవి కాలం ముగిసే వరకు పిల్లలను తల్లిదండ్రులు కనిపెట్టుకొని ఉండాలి.

– శ్రీనివాసులు, ధర్మవరం రూరల్ ఎస్‌ఐ

ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

బత్తలపల్లి: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహనాయుడు కోరారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ 21 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఎస్సీలు రుణాలకు అర్హులని పేర్కొన్నారు. స్వయం ఉపాధి కింద రవాణా రంగానికి సంబంధించి అయిఏ దరఖాస్తుదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. జనరిక్ ఫార్మసీ పథకాలకు డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ ఉండాలని పేర్కొన్నారు. ఆధార్, లింక్ అయిన ఫోన్ నంబర్, రేషన్‌కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రవాణాకు సంబంధించి అయితే డ్రైవింగ్ లైసెన్స్‌తో మే పదో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

నల్లచెరువు: పంతులచెరువు పంచాయతీలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్న పక్కీరప్ప (75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రవికుమార్, డీటీ రవినాయక్ తమ కార్యాలయ సిబ్బందితో కలిసి వెళ్లి వీఆర్‌ఏ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమ సంస్కారాలకు తక్షణ సాయంగా రూ. 25వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లక్ష్మీదేవి, వీఆర్‌ఓలు సుశీల, నీలకంఠరెడ్డి, సర్వేయర్ హరీష్, వీఆర్‌ఏలు లక్ష్మీపతి, రవి, శ్రీనివాసులు, రమణ, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై చర్యలు తీసుకోండి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

ధర్మవరం: పల్నాడు జిల్లాలో అంగన్‌వాడీ టీచర్‌ను లైంగికంగా వేధించిన టీడీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు జేవీ రమణ, ఎస్‌హెచ్ బాషా, అయూబ్‌ఖాన్, హైదరవలి, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రకళ మంగళవారం ధర్మవరంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో అంగన్‌వాడీ టీచర్ స్వర్ణలతపై టీడీపీ నేత బొడ్డు వెంకటేశ్వరరావు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ భర్త చనిపోవడంతో ఆమెకు ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ ఇప్పిస్తామని చెప్పి.. ఆమెతో రూ.లక్ష డబ్బులు తీసుకుని.. తర్వాత అనేక రకాలుగా ఆమెను లైంగికంగా వేధించారని ఆరోపించారు. వెంకటేశ్వరరావును వెంటనే టీడీపీ నుంచి సస్పెండ్ చేసి, చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు పోతక్క, అరుణ, రత్నమ్మ, జ్యోతి, శకుంతల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాల్సిందే



దీక్షకు మద్దతు తెలుపుతున్న కరస్పాండెంట్ చాంద్ బాషా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత సుబహాన్

ధర్మవరం: వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని కేంద్రం తక్షణమే రద్దు చేయాలని జామియా మసీద్, ఫిరదోస్ మసీద్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ముస్లింలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజు మంగళవారం కూడా కొనసాగాయి. దీక్షలకు కొత్తపేట ఉషోదయ పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు సుబహాన్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనతో వక్ఫ్ సవరణ చట్టం తీసుకొచ్చిందని మండిపడ్డారు. అనేక ఏళ్లుగా తమ ఆస్తులను కాపాడుకుంటూ ఖబర్‌స్థాన్, మసీదులు, ఈద్గాలు, మదరసాలు, పేద ముస్లింలు, వికలాంగుల అభ్యున్నతి కోసం ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అలాంటి ఆస్తులను లేకుండా చేయాలనే ఆలోచనతో వక్ఫ్ కమిటీలో అన్యమతస్తులకు ప్రవేశం కల్పించే విధంగా జీఓ చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఎన్పీకుంట: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ మాధవరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించాలని సూచించారు.

ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

హిందూపురం అర్బన్: ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దని .. అనారోగ్యానికి గురైతే ఎప్పటి కప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి ఉపకారాగార అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక సబ్ జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా ఖైదీలతో మాట్లాడారు. ఏ నేరాల్లో జైలుకు వచ్చారు? ఎప్పటి నుంచి జైళ్లలో ఉంటున్నారు? న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నాయవాదులను పెట్టుకునే స్థోమత లేని వారు దరఖాస్తు చేసుకొంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ధర్మవరంలో వాటర్ డెమో ఇస్తున్న ఫైర్ సిబ్బంది



పుట్టపర్తిలో ఫైర్ సిబ్బంది కవాతు



కదిరి వేమారెడ్డి సర్కిల్‌లో...

ధర్మవరం అర్బన్: అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి రాజు తెలిపారు. పట్టణంలో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వాటర్ డెమో చేసి చూపించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్, కళాజ్యోతి సర్కిల్‌లలోని హోటళ్లు, దుకాణాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఎలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ

పుట్టపర్తి టౌన్: అవగాహన, జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చునని ఏడీఎఫ్‌ఓ నాగరాజునాయక్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది మంగళవారం పుట్టపర్తిలో విద్యాగిరి ఆర్చ్ నుంచి హనుమాన్ కూడలి వరకు కవాతు నిర్వహించారు. ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్, విన్యాసాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని మాపక ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా బయటపడాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

అగ్నిమాపక వారోత్సవాలు

కదిరి టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్, వేమారెడ్డి సర్కిల్‌లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ కరపత్రాలు అందజేస్తూ, ఫైర్ విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఎస్.శ్రీధర్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఇరు వర్గాల వారిపై కేసులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని గేటు కొట్టాలలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణ– ఆత్మహత్యాయత్నం ఘటనలో ఇరువర్గాల వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ కార్యకర్త దాదావలి, మరో ముగ్గురు కలిసి తనను అసభ్యకరంగా దూషించడంతో మనస్తాపం చెంది తన భర్త వైఎస్సార్‌సీపీ కార్యకర్త బాబ్‌జాన్ ఆత్మహత్యాయత్నం చేశాడని హసీనా అనే మహిళ ఫిర్యాదు చేసింది. బాబ్‌జాన్ కుటుంబ సభ్యులు నలుగురు తమ ఇంటిపైకి దూసుకొచ్చి దూషించారంటూ టీడీపీ కార్యకర్త దాదావలి సైతం ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ మంగళవారం ముదిగుబ్బకు వచ్చి ఇరు వర్గాల వారినీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఇరు వర్గాల వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపాడు.

ద్విచక్రవాహనం అపహరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటకు చెందిన కిరణ్‌కుమార్ తన ఇంటిముందు ఉంచిన ద్విచక్రవాహనం సోమవారం రాత్రి అపహరణకు గురైంది. మంగళవారం ఉదయం బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఆధ్యాత్మిక కేంద్రంలో ఇతరుల ఫ్లెక్సీలు నిషేధించాలి



రత్నాకర్‌ను కలసిన సత్యసాయి భక్తులు

పుట్టపర్తి రూరల్: ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో రాజకీయ, ప్రైవేట్ వ్యక్తుల ఫ్లెక్సీల ఏర్పాటు నిషేధించాలని శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ను సత్యసాయి భక్తులు కోరారు. మంగళవారం సత్యసాయి నగర సంకీర్తన భజన బృందం రత్నాకర్‌ను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. సత్యసాయి పాత మందిరం పెద్ద వెంకమ్మ రాజు కల్యాణ మండపం వద్ద అధికంగా రాజకీయ, వ్యక్తిగత పోస్టర్లు ఏర్పాటు చేశారని, వాటిని నిషేధించాలని కోరారు.

నేడు మండల సమావేశం

కనగానపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు భరోసా కల్పించండి

ధర్మవరం రూరల్: పరీక్షల్లో ఫెయిల్ అవుతామని, మార్కులు తక్కువ వస్తాయని భయపడి ఏ ఒక్క విద్యార్థీ ఆత్మహత్య చేసుకోకుండా ధైర్యంగా మళ్లీ ప్రయత్నం చేస్తే తప్పకుండా విజయం సాధిస్తారని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిలైనా సూటిపోటి మాటలతో కాకుండా ప్రేమతో దగ్గరకు చేర్చుకొని వారికి భరోసా కల్పించాలని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

కార్మికులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించొద్దు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ కార్మికులను ఆప్కాస్ నుంచి తీసి ప్రైవేటు సంస్థలకు అప్పగించద్దని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాయలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను ప్రభుత్వం ఎప్పటికైనా పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తిస్తుందన్న ఆశతో 25 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని చూస్తోందన్నారు. అలా జరిగితే కార్మికులవి బానిస బతుకులవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నరసింహ, నాగార్జున, నారాయణ, రామయ్య, పెద్దన్న, నాగరాజు, గోవిందు, సద్దాం, సరోజ, నారాయణమ్మ, అనిత తదితులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు అందిస్తున్న యోగా గురువు తదితరులు

ధర్మవరం అర్బన్: కిడ్నీ బాధితుడికి పలువురు తమవంతుగా నిత్యావసర సరుకులు అందజేశారు. పట్టణంలోని మహాత్మాగాంధీకాలనీలో నివసిస్తున్న మల్లిపోగుల శ్రీనివాసులు రెండు కిడ్నీలు చెడిపోయి మంచానికే పరిమితమవగా.. కుటుంబ భారాన్ని మోస్తున్న కుమార్తె గురించి ఈ నెల 10న 'తండ్రి కోసం తనయ పోరాటం' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. యోగా గురువు గొర్ల నారాయణరెడ్డి, ఆయన స్నేహితులు స్పందించి మంగళవారం శ్రీనివాసులు ఇంటికి వెళ్లి బియ్యం, కందిబేడలు తదితర నిత్యావసర సరుకులను అందించారు.

కూరగాయల వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



రహదారిని శుభ్రం చేసిన దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో పోస్టాఫీస్‌కు వెళ్లే రహదారిలో అపరిశుభ్రతను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. 'రహదారిపైనే కూరగాయల వ్యర్థాలు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ ప్రమోద్‌కుమార్ మున్సిపల్ కార్మికులను పంపించి కూరగాయల వ్యర్థాలను తొలగించి, రహదారిని శుభ్రం చేయించారు.

చల్లగా.. తియ్యగా..



తాటి ముంజలు విక్రయిస్తున్న దృశ్యం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కళింగర కాయలు

ధర్మవరం రూరల్: వేసవి సీజన్‌లో దొరికే కాయలలో తాటిముంజ, కళింగరకు డిమాండ్ పెరిగింది. తాటిముంజల ధర కాస్త ఎక్కువగా ఉన్నా.. కళింగర తక్కువ ధరలోనే లభిస్తోంది. సీజన్‌లో మాత్రమే దొరికే ఈ కాయల రుచిని ఆస్వాదించడానికి ప్రజలు ఎంతగానో ఆసక్తి చూపుతున్నారు. ధర్మవరంలో వీటి విక్రయాలు జోరందుకున్నాయి.